క్లుప్తంగా

భ్రమరాంబామల్లికార్జున స్వామికి పూజలు



ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల : మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంబామల్లికార్జునస్వామి ఆలయంలో ఆశాఢ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ



యాగంటిలో ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమా మహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసిన పల్లకీలో ఆసీనులు గావించి పల్లకీ సేవ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే జన్మకు సార్థకత



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : సమాజసేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఉపేంద్ర, వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. పట్టణంలో లయన్స్ క్లబ్‌లో 2025-26 సంవత్సరానికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు మధు సుధాకర్ రెడ్డి, రాజు, కోశాధికారి మనోహర్ రెడ్డి తోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే సమాజ సేవకు తమ వంతు తోడ్పాటు అందించేందుకు పట్టణానికి చెందిన గుండా ఆశ్వర్థ నారాయణ, వన్నూర్ బాషా, కేశాలు నాయుడు, రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు లయన్స్ క్లబ్‌లో చేరారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొప్పుల రమణారెడ్డి (34) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఇంట్లో ఉన్న సమయంలో అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి హైదరాబాదు నుంచి అంకిరెడ్డిపల్లెకు చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు అన్నారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చిన్నమల్కాపురం, ఎర్రగుండ్ల, వలిసెల, కమలాపురం, కన్నపకుంట, ధర్మారం, గోసానిపల్లె, చింతలపేట, కొచ్చెర్వు గ్రామాల్లో పర్యటించి 65 మందిని చేర్చుకున్నారు. కార్యక్రమంలో సురేష్, బెనర్జీ, సుబ్బరాయుడు, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బనగానపల్లె రూరల్: ఈ నెల 30, 31వ తేదీల్లో డోన్ పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రెండవ మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు, రైతులు రైతు కూలీలు హాజరుకావాలని కోరారు.నాయకులు సుబ్బరెడ్డి, మద్దిలేటి సుబ్రమణ్యం,ఎర్రిస్వామి,రవి నాగ ఆంజనేయులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆయుర్వేద వైద్యశాల



అసంపూర్తిగా నిలిచిన ఆయుర్వేద వైద్యశాల

బనగానపల్లె : పట్టణంలో పది పడకల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోవడంతో..పతనావస్థకు చేరిన పురాతన ఆయుర్వేద వైద్యశాలలో రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. 40 సంవత్సరాల క్రితం బనగానపల్లెలో రాయలసీమలోనే పది పడకల ఏకైక అతిపెద్ద ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ వైద్యశాల అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారడంతో 2023లో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో ప్రభుత్వం ద్వారా రూ.56.25లక్షలను మంజూరు చేయించి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. 2024లో ఎన్నికల సమయానికి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులు పూర్తి అయ్యేందుకు మరో రూ.13.50 లక్షలు అవసరమని నిధులు మంజూరు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మూడు నెలల క్రితం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇంత వరకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆసుపత్రి భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆసుపత్రి భవనానికి కిటికీలు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా నిలిచిపోయిన వైద్యశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపాం

భవన నిర్మాణ ప్రారంభంలో మంజూరైన నిధులు చాలనందున పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు రూ.13.50 లక్షలు అవసరమని, మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం.

– అబిద్, ఏఈఈ

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వివిధ పంటల్లో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం నంద్యాల వ్యవసాయాధికారి హేమసుందర్, సహాయ వ్యవసాయ సంచాలకులు సరళమ్మ సూచించారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ పంటల సాగు మెలకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మినుము, పెసర, మొక్కజొన్న, కంది తదితర పంటల్లో భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువుల వినియోగం, నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తన మోతాదు కీలకమన్నారు. పైరు వేసినప్పటి నుంచి పంట చేతికందే వరకు వ్యవసాయ అధికారుల సూచనలు,సలహాలు పాటించాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

24న చౌడేశ్వరీ దేవి జయంతి

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయంలో ఈనెల 24న అమ్మవారి జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయం 7గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై కొలువుంచి పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రేషన్ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: చౌకదుకాణాల ద్వారా ప్రతి నెలా ప్రజా పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని నిత్యావసర చౌకదుకాణాల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేసే సరుకులు అందజేయాలన్నారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

డీఎస్సీ నిర్వహణలో గందరగోళం

కోవెలకుంట్ల: గత నెలలో నిర్వహించిన డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణలో అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష ఒకేసారి కాకుండా విడతలవారీగా జరిపడంతో సమస్య మొదలైందన్నారు. దీనివల్ల కొందరు అభ్యర్థులకు పరీక్షా పేపర్ సులభంగా, మరికొందరికి కఠినంగా వచ్చిందన్నారు. పేపర్ కఠినంగా వచ్చిన అభ్యర్థులకు కొన్ని మార్కులు కలుపుతామనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. పరీక్ష ఒకే సారి నిర్వహించి ఉంటే సమస్య ఉత్పన్నమయ్యేదే కాదన్నారు.

యాగంటికి చేరుకున్న పుట్టపర్తి సత్యసాయి ధర్మప్రచార రథం



బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయానికి పుట్టపర్తి శ్రీసత్యసాయి ధర్మప్రచార రథకం కోవెలకుంట్ల నుంచి సోమవారం సాయంత్రం చేరుకుంది. వాహనానికి ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మప్రచార రథం సాయిసేవకులు మాట్లాడుతూ పుట్టపర్తి శ్రీ సత్య సాయి ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను సందర్శిస్తూ ఆయా గ్రామాల్లో సత్య సాయి ధర్మ ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. సేవకులు రిటైర్డ్ డీఈఈ కృష్ణయ్య బృందం ఉన్నారు.

మండల మీట్ వాయిదా

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని 26వ తేదీకి మార్చినట్లు ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సోమ వారం తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మార్పు చేయాల్సి వచ్చిందన్నారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షత్యన నిర్వహించే మండల మీట్‌కు ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సంజామలలో..

సంజామల: ఈ నెల 23వ తేదీన సంజామలలో జరిగనున్న సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సాల్మన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సమావేశాన్ని ఈనెల 26వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని 211 మంది ఆటో డ్రైవర్లకు సీఐ వెంకటేశ్వరరావు గుర్తింపు కార్డులను అందజేశారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండటమే కాకుండా, నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని సూచించారు.

సంక్షేమ గృహాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

నంద్యాల: జిల్లాలోని సంక్షేమ గృహాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వివిధ అంశాలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత జిల్లా అధికారులు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపైఅవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉంటే వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీ-4 బంగారు కుటుంబాల చేయూత కోసం మార్గదర్శులను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన గ్రామసభలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మట్టి గృహాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, ఎస్‌డీసీ లు,వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,డివిజన్ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట పైర్లతో భూసారం పెంపు

నంద్యాల: భూసారం పెంపునకు పచ్చి రొట్ట పైర్లను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రైతులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చి రొట్టె పైర్ల వాడకానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఎరువులు, పురుగుమందు వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవుకు: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ పక్కీరయ్య సోమవారం తెలిపారు.అవుకుతో పాటు,గుండ్లశింగవరం, ఉప్పలపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యహ్నం 2 గంటల వరకు నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

రెండు రోజుల పాటు..

ప్యాపిలి: సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంగళాంపల్లి, వెంకటాపురం, ఎన్ రంగాపురం గ్రామాల్లో మంగళవార ం, బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ట్లు తెలిపారు. వ్యవసాయానికి వేకువజామున 3 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రా త్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

కారులో వ్యక్తి మృతి

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన చౌడేశ్వరి మాత ఆలయం సమీపాన కారులో వెళ్తున్న అవుకు మండల వాసి మరణించిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు అవుకు మండలం, శింగనపల్లె గ్రామానికి చెందిన బుజాల రాజశేఖర్ రెడ్డి(50) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం డయాలసిస్ చేయించుకునేందుకు కారులో ఒక్కడే కర్నూలుకు బయలు దేరాడు. బేతంచెర్ల పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకొని కొంత దూరం వెళ్లాక డ్రైవింగ్ చేస్తూ కుప్పకూలి మరణించాడు. రహదారి గుండా వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

డోన్ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక ఆహార పదార్థాల పంపిణీకి సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ పద్ధతిని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సులోచన, నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు సరుకులు అందించే సమయంలో నెట్ వర్క్ సరిగా పని చేయకపోవడంతో వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం సీడీపీఓ శంషాద్ బేగంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుమలత, రహమత్‌బీ, గుల్జార్, వరలక్ష్మి, రామతులసీ, సుభద్ర తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఏఓ వెంకటేశ్వర్లు

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్లతో ఎరువుల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హోల్‌సేల్ డీలర్లు ఎరువులను రిటైల్ డీలర్లందరికీ అవసరమైన మేరకు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో 2వేల టన్నుల యూరియా, 1200 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని, ఈ వారంలో జిల్లాకు 3,500 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ, మార్క్‌ఫెడ్ ఎండీ హరినాథరెడ్డి, ఏఓ ప్రసాదరావు, శారదా, తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులను వినియోగించుకోవాలి

దొర్నిపాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు యూరియా కొరత ఏర్పడకుండా పంటలకు నానో ఎరువులను వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలన్నారు. ఏ పంట సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయి, ఎరువులు ఏ మోతాదులో వాడాల్లో తెలుస్తుందన్నారు. ఇష్టం వచ్చినట్లు ఎరువులు వాడితో నేల స్వభావం దెబ్బతిని భవిష్యత్ తరాలకు సాగుకు నేల అనుకూలించదన్నారు. ప్రతి రైతు పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు వెంకటేశ్వరరెడ్డి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం , డిప్యూటీ సీఎం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి..ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



ఖ్వాజా బందేనవాజ్ పీర్ల చావిడి వద్ద కిక్కిరిసిన భక్తులు



ముచ్చలపురిలో పీర్లను ఊరిగేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. వేకువజామున 4 గంటలకు ప్రారంభమైన పీర్ల సవారి ఉదయం 10.30 గంటల వరకు సాగింది. దారి పొడవునా భక్తులు పీర్ల స్వాములను దర్శించుకుని చక్కెర ఫాతెహాలు సమర్పించారు. స్థానిక చిల్లాకట్ట వద్ద ఏర్పాటు చేసిన గుండంలో పీర్ల స్వాములు, భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసే సన్నివేశాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సాయంత్రం పీర్లు ఏటికి వెళ్లే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగిన పీర్ల గ్రామోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని వెంగన్న బావి వద్ద పీర్లను శుద్ధి చేసి ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచారు. అక్కడి నుంచి విషాద గీతాలు ఆలపిస్తూ పీర్ల చావిళ్లకు చేరుకోవడంతో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

ముగిసిన జియారత్

సంజామల: మండలంలోని ముచ్చలపురి గ్రా మంలో మౌలాలి పీరు జియారత్ వేడుకలు సో మవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఆదివారం అర్ధ రాత్రి పీర్ల ఊరేగింపు చేపట్టారు. భక్తులు పీరుకు ఫాతెహాలు సమర్పించి మొక్కు లు చెల్లించుకున్నారు. సోమవారం ఉదయం పీర్ల ఊరేగింపు అనంతరం పీరు చావిడిలో కొలువుదీరడంతో వేడుకలు ముగిశాయి.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ బాధిత సంఘం గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు

డోన్ టౌన్ : అగ్రిగోల్డ్ బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగేశ్వరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడులు డిమాండ్ చేశారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో సోమవారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అగ్రిగోల్డ్ కష్టమర్లకు, ఏజెంట్లకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం గడిచినా కనీసం చర్చలు కూడా జరపక పోవడం దారుణమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, ఏజెంట్లు, కష్టమర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించిన గ్రామస్తులు



డోన్ టౌన్ : మండలంలోని బొంతిరాళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు గౌరీ, మన్సూర్‌బాషా బదిలీపై వెళ్తుండటంతో గ్రామ ప్రజలు సోమవారం వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గ్రామంలో విద్యాభివృద్ధికి, వివిధ పాఠశాలల ప్రవేశాలకు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇక్కడికి బదిలీపై వచ్చిన పద్మావతి టీచర్‌కు ఆహ్వానం పలుకుతూ అభినందనలు తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ గొల్ల సుదర్శన్, మధుసూదన్, తిరుపాలు, వల్లె హనుమన్నే, రాయుడు, కోట్ల సుంకన్న తదితరులు ఉన్నారు.

డీఎస్పీ విచారణకు హాజరైన కాటసాని ఓబుల్ రెడ్డి

డోన్ టౌన్ : బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి సోమవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఎదుట హాజరయ్యారు. గత సంవత్సరం బనగానపల్లె మార్కెట్‌లో జరిగిన గోడవ కేసులో ఓబుల్‌రెడ్డిని పోలీసులు నిందితుడిగా చేర్చడంతో ఆయన హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఓబుల్ రెడ్డిని అరెస్టు చేయకుండా స్టే మరియు ఈ కేసు విచారణకు న్యాయవాది సమక్షంలో చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఓబుల్‌రెడ్డిని సోమవారం డోన్‌కు విచారణ నిమ్మిత్తం పిలవడంతో ఆయన న్యాయవాదిలో కలిసి విచారణకు హాజరై తిరిగి వెళ్లారు.

కోవెలకుంట్లలో 24.6 మి.మీ. వర్షం

కోవెలకుంట్ల: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రెండు రోజుల నుంచి స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 24.6 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 16.2 మి.మీ, అవుకు మండలంలో 10.2 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 10 మి.మీ, సంజామల మండలంలో 9.8 మి.మీ, దొర్నిపాడు మండలంలో 7.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. గత నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో 24,915 హెక్టార్లలో వరి, పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, ఉల్లి, సోయాబీన్ తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,572 హెక్టార్లలో మొక్కజొన్న, 1,399 హెక్టార్లలో మినుము, 196 హెక్టార్లలో పత్తి, 114 హెక్టార్లలో కూరగాయలు, 35 హెక్టార్లలో కంది, మరో 52 హెక్టార్లలో ఇతర పంటలు మాత్రమే సాగయ్యాయి. విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షం కురవకపోవడంతో సాగు చేసిన పంటల్లో ఎదుగుదల నిలిచిపోయి వాడుముఖం పట్టాయి. ఈ తరుణంలో కురిసిన వర్షం పంటలకు అనుకూలంగా మారింది.

అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలి



బనగానపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

బనగానపల్లె రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో యాప్‌ల భారం తగ్గించాలని, అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారించాలని అంగన్‌వాడీ కార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న యాప్‌లతో వేదనకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతి పత్రాన్ని సీడీపీవో ఉమామహేశ్వరమ్మకు అందజేశారు. నాయకులు సుబ్బయ్య, నాగరాజు, రోజారమణి, హేమలత, శోభ, రమాదేవి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీలో స్థానం



నాగమోహన్ రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

డోన్ టౌన్: బీజేపీ జిల్లా నూతన కమిటీలో డోన్‌కు చెందిన సందు వెంకటరమణను నంద్యాల ఉపాధ్యక్షుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఒంటెద్దు బండి కిరణ్‌ను, జిల్లా కార్యదర్శిగా బేతంచెర్ల పట్టణానికి చెందిన పత్తి రామ్మోహన్‌ను ఎనుకున్నారు. సోమవారం నంద్యాల పట్టణంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ఇన్‌చార్జ్ పోతుగంట రమేష్ నాయుడు వీరిని నియమించినట్లు ప్రకటించారు.

బేతంచెర్ల: పట్టణానికి చెందిన నాగ మోహన్ రెడ్డి బీజేపీ జిల్లా కార్యదర్శిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు హేమ సుందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివ రామి రెడ్డి, సీనియర్ నాయకులు ఆయనను సన్మానించారు.

మండల సర్వేయర్‌పై ఫిర్యాదు

డోన్ టౌన్ : మండల ల్యాండ్ సర్వే అధికారిగా విధులు నిర్వహిస్తున్న జగదీష్‌కుమార్‌పై సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాల్లో బీజేపీ, సీపీఐ నాయకులు ఫిర్యారు చేశారు. జిల్లా కలెక్టర్‌కు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్‌రెడ్డి, డోన్‌లో తహసీల్దార్ రవికుమార్‌కు సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కమిటీ సభ్యులు ఎస్ఏ చిన్నరహిమాన్ తదితరులు ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రభుత్వ భూముల రికార్డులు మార్చి అక్రమంగా కొంత మంది వ్యాపారులకు కట్టబెడుతున్నాడన్నారు. అదేవిధంగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ రీ సర్వే గ్రామాల్లో అక్రమాలకు తెరలేపాడని ఆరోపించారు. బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, రామచంద్రనాయుడు, హెచ్‌కే నాయుడు, ముదిరాజ్, లక్ష్మీనారాయణ, సీపీఎం, ఐద్వా నాయకురాలు షమీమ్‌బేగం, శరీనా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.